సాక్షి
వైఎస్సార్ జిల్లా

శుక్రవారం । 1 । ఆగస్టు । 2025



డ్రాగా ముగిసిన మ్యాచ్‌లు
ఏసీఏ అండర్‌-16 మల్టీ డే మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. వైఎస్‌ఆర్‌ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప-అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. -8లో



అక్రమ చేపల వేట నిర్వహణపై కఠిన చర్యలు
నిషేధిత సమయంలో అక్రమ చేపల వేట నిర్వహించే వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర మత్స్యశాఖ ఏడీ ఆదేశించారు. -8లో

గరిష్టం/కనిష్టం
34.2/26.8

వాతావరణం
జిల్లాలో గురువారం 26.8 - 34.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 8.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నియామకం
కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన టి.రమేష్ రెడ్డిని రాష్ట్ర ఐటీ విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

విజయవాడలో హజ్ ఎంబార్కేషన్ కేంద్రం
మదనపల్లె సిటీ: హజ్‌యాత్రికుల సౌకర్యార్థం విజయవాడలో కొత్తగా హజ్ ఎంబార్కేషన్ కేంద్రం ఏర్పాటు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు పఠాన్ ఖాదర్‌ఖాన్ తెలిపారు. ఈ నిర్ణయంతో యాత్రికులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. యాత్రికులు విజయవాడ కేంద్రంగా ఎంపిక చేసుకుని దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గురుకులంలో నేరుగా ప్రవేశాలు
కడప రూరల్: వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల్లోని 24 డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలల్లో 2025-2026 విద్యా సంవత్సరానికి ఖాళీలను భర్తీ చేయడంలో భాగంగా నేరుగా ప్రవేశాలు పొందవచ్చని జిల్లా సమన్వయకర్త ఉదయశ్రీ తెలిపారు. 6వ తరగతి నుంచి ఇంటర్‌మీడియట్ వరకు ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా తరగతుల్లో చేరడానికి, విద్యార్థులు నేరుగా స్థానిక గురుకుల పాఠశాల ప్రిన్సిపల్స్‌ను సంప్రదించి ప్రవేశాలు పొందవచ్చని అన్నారు.

ఆధార్ లేకపోయినా పాఠశాలల్లో ప్రవేశం
కడప ఎడ్యుకేషన్: తాత్కాలికంగా ఆధార్ నెంబర్ లేకపోయినా పిల్లలను పాఠశాలల్లో చేర్చుకుంటారని డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. కానీ భవిష్యత్తులో ఆధార్‌కార్డు తెచ్చుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలను పొందడానికి ఆధార్ తప్పనిసరి అన్నారు. గురువారం చెన్నూరు మండలంలోని ఎంపీపీ తెలుగు మెయిన్, కేఓఆర్‌కాలనీ పాఠశాల, బెస్త పాఠశాల పరిధిలోని ఆధార్‌కార్డు లేని విద్యార్థుల తల్లిదండ్రులతో డీఈఓ మాట్లాడారు. ప్రస్తుతానికి పాఠశాలల్లో చేర్పించుకుంటారని.. భవిష్యత్తులో ఆధార్ కార్డు పొందాలని సూచించారు.

అసత్య ప్రచారాలను నమ్మొద్దు
కడప కోటిరెడ్డిసర్కిల్: రాయలసీమ ప్రాంతానికి చెందిన కొన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు గృహ హింస చట్టం-2005 అమలుకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నట్లు ప్రచారం చేస్తున్నాయని, ఇది పూర్తిగా అసత్యపు ప్రచారమని జిల్లా ఐసీడీఎస్ పీడీ పి.రమాదేవి తెలిపారు. గృహహింస చట్టం -2005ను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ద్వారా జిల్లా స్థాయిలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారి ఆధ్వర్యంలో మాత్రమే అమలు జరుగుతోందన్నారు. గృహ హింసలకు పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళలు గృహహింస నుంచి రక్షణ పొందేందుకు కలెక్టరేట్‌లోని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారి, వైఎస్సార్‌కడపజిల్లా కార్యాలయంలో సంప్రదించాలని ఆమె సూచించారు.

బాబు హామీ.. నెరవేరదేమీ!

సీఎం చంద్రబాబు మాటలు.. నీటిపై రాత లేనని మరోసారి తేటతెల్లమైంది. సరిగ్గా రెండు నెలల క్రితం కడప గడ్డపై జరిగిన మహానాడులో వివిధ పనుల కోసం వేల కోట్ల నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. వేలాది మంది సాక్షిగా.. వందలాది నేతలు చూస్తుండగా జిల్లాకు వరాల జల్లు ప్రకటించారు. నెలలు గడిచాయి.. ఒక్కటంటే ఒక్క హామీ అమలయ్యింది లేదు. ఒక్క రూపాయి విడుదల చేసింది లేదు. ఆయనంతే.. వైఎస్సార్ కడప జిల్లా అంటే ఆయనకెప్పుడూ కడుపుమంటే.

- మహానాడు వేదికగా వేలకోట్ల నిధుల మంజూరుకు హామీ
- రెండు నెలలవుతున్నా ఆచరణ శూన్యం!
- బాబు మాటలు.. గాలి బుడగలేనా!
- నాడు ఓట్లు-సీట్లు ఇవ్వలేదన్న చంద్రన్న... సీట్లు ఇచ్చినా అదే వివక్షత
- నేడు జిల్లాకు సీఎం చంద్రబాబు



సాక్షి ప్రతినిధి, కడప: నోటితో చెప్పడం నొసటితో వెక్కిరించడమే చంద్రబాబు నైజమని మరోసారి రుజువైంది. జిల్లా పారిశ్రామిక ప్రగతికి చేయూతనిస్తానంటూ మాటలు చెప్పే బాబు.. ఆచరణలోకి వచ్చేసరికి అవరోధాలెన్నో సృష్టిస్తారు. నాటి బ్రహ్మణీ స్టీల్స్ నుంచి నేటి పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాల వరకూ ఆయన కలిగించిన ఆటంకాలకు ఎన్నో మచ్చుతునకలు. చివరికి సాగు, తాగునీరు సరఫరాకు యోగ్యకరంగా నిలుస్తున్న పోతిరెడ్డిపాడు విస్తరణ పనులకు సైతం అడ్డుతగిలారు. ఫలితంగా జిల్లా నిర్దిష్టమైన అభివృద్ధి సాధించడం లేదని రాజకీయ పరిశీలకులు, మేధావులు అభిప్రాయపడుతున్నారు.

బాబుకు ఓట్లు.. సీట్లే ముఖ్యం

సీఎం చంద్రబాబుకు రాయలసీమ ప్రజల ఓట్లు కావాలి కానీ..ఇక్కడ అభివృద్ధి చేయడానికి ఆయనకు మనసొప్పదు. చివరికి తన సొంత నియోజకవర్గం కుప్పానికి కూడా సాగునీరు ఇచ్చేందుకు చేపట్టిన జీఎన్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ అనుసంధానం ప్రక్రియను కూడా అడ్డుతగిలారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. గత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన అభివృద్ధిని కూడా కొనసాగించలేని సంకుచిత మనస్తత్వం బాబుది. అందుకు పులివెందుల ప్రభుత్వ మెడికల్ కళాశాలే ప్రత్యక్ష నిదర్శనం. జిల్లా అభివృద్ధి కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రూ.530 కోట్లతో పులివెందుల మెడికల్ కాలేజీ నిర్మించి అన్ని వసతులను సమకూర్చారు. ఎన్ఎంసీ (నేషనల్ మెడికల్ కౌన్సిల్) అనుమతి కూడా ఇచ్చింది. 2024-25 విద్యా సంవత్సరానికి 50ఎంబీబీఎస్ సీట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు సైతం జారీ చేసింది. కాకపోతే పెండింగ్ పనులు ఆటంకం లేకుండా పూర్తి చేస్తామని ధ్రువీకరిస్తూ లేఖ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి కోరింది. ఆ లేఖను ఇస్తే 2024-25కు 50 ఎంబీబీఎస్ సీట్లు భర్తీ అయ్యేవి. 5శాతం పెండింగ్ పనులు కొనసాగించేందుకు చంద్రబాబు సర్కార్‌కు మనసు రాలేదు. ఫలితంగా 2024-25లో 50 సీట్లు.. ఈ ఏడాది 2025-26లో 150 ఎంబీబీఎస్ సీట్లు జిల్లాకు రాకుండా పోయాయి. సీమ విద్యార్థుల ఆశలపై నీళ్లు చల్లడం బాబుకే చెల్లింది. 2014లో అధికారం దక్కించుకున్న తర్వాత ఏకంగా ఓ బహిరంగ సభలోనే 'మీరు నాకు ఓటేశారా...మీకు అభివృద్ధి చేయడానికి..? అంటూ సీఎం హోదాలో చంద్రబాబు ప్రశ్నించారు. ఈమారు ఓట్లు సీట్లు ఇచ్చినా ఈప్రాంతం పట్ల అక్కసు, అసూయ తగ్గడం లేదని పలువురు మండిపడుతున్నారు. మభ్యపెట్టే మాటలు చెప్పడం మినహా నిర్దిష్టమైన అభివృద్ధి కోసం ప్రణాళికలు చేసిన చరిత్రే చంద్రబాబుకు లేదని విశ్లేషకులు దెప్పిపొడుస్తున్నారు.


పోలవరం-బనకచర్ల అంటూ కొత్త రాగం...

నాడు విజన్ 2020 అంటూ ఊదరగొట్టిన సీఎం చంద్రబాబు తాజాగా విజన్ 2047 అంటూ కొత్త పల్లవి అందుకున్నారు. సాగునీటి రంగానికి వచ్చే కొద్ది పట్టిసీమ ప్రాజెక్టులో రాయలసీమ సస్యశ్యామలమంటూ 2014-19లో ఊదరగొట్టారు. ఐదేళ్ల పాటు పట్టిసీమ అంటూ ఊరు వాడా చెప్పుకొచ్చారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సైతం అదే కారణంతో తెలుగుదేశం పార్టీలో చేరుతున్నట్లు కూడా ప్రకటించారు. రాయలసీమ సస్యశ్యామలం చేసేందుకు చర్యలు చేపడుతుంటే వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ ఓర్చుకోలేకుందని ఎవరి నోటా విన్నా ఇదే విమర్శే వచ్చేది. తాజాగా పట్టిసీమ పోయి 'పోలవరం-బనకచర్ల'అనుసంధానం, గోదావరి నీళ్లు పెన్నాలో కలపడమే ధ్యేయమంటూ కొత్త రాగం అందుకున్నారు. మరో ఐదేళ్లు ఇదే మాట చెబుతూ కాలంవెళ్లబుచ్చే అవకాశం అందిపుచ్చుకున్నారని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

- తాజాగా శుక్రవారం జిల్లా పర్యటనకు సీఎం చంద్రబాబు రానున్నారు. జమ్మలమడుగు నియోజకవర్గం గూడెంచెరువు గ్రామంలో పింఛన్ల పంపిణీ అనంతరం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. ఇందులో ఒబెరాయ్‌గ్రూప్ సెవెన్‌స్టార్ హోటల్ శంకుస్థాపన కూడా ఉంది. దీనిని 2023జూన్ 9న అప్పటి సీఎం వైఎస్ జగన్ శంకుస్థాపన చేశారు. దీనిని మరోమారు సీఎం చంద్రబాబు చేపట్టడాన్ని పలువురు ఎద్దేవా చేస్తున్నారు. కాగా, ఈసారైనా అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని.. మహానాడు వేదికగా చెప్పిన హామీలను అమలు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మహానాడు హామీలకు దిక్కులేదు
జిల్లాలో తెలుగుదేశం పార్టీ నిర్వహించిన మహానాడు సందర్భంగా మే 27-29 వరకూ సీఎం చంద్రబాబు ఇక్కడే తిష్టవేశారు. మే 29న జిల్లా అభివృద్ధి కోసం హామీలు ఇచ్చారు. జీఎన్ఎస్ఎస్ ఫేజ్-1 పనులు నిధుల లేమి కారణంగా ఆలస్యంగా నడుస్తున్నాయని అందుకు కోసం రూ.1000 కోట్లు విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. వీరపునాయునిపల్లె, వేంపల్లే, వేముల, పెండ్లిమర్రి, చింతకొమ్మదిన్నె, వల్లూరు, కమలాపురం, కడప మండలాల్లో భూసేకరణ, పెండింగ్ పనులు నిర్వహణ కోసం వెచ్చించనున్నట్లు ప్రకటించారు. అవేవీ కార్యరూపం దాల్చలేదు. అలాగే వామికొండ, సర్వారాయసాగర్ డిస్ట్రిబ్యూటరీ కెనాల్ కోసం రూ.170 కోట్లు, గండికోటలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం ఏర్పాటుకు రూ.32.5కోట్లు, ఆంధ్రప్రదేశ్ అర్బన్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ కింద కడపకు రూ.68.45కోట్లు, బుగ్గవంక ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ.100కోట్లు, చెన్నూరు సమీపంలో ఉన్న హజ్‌హౌస్ పూర్తి కోసం రూ.10 కోట్లు మొత్తం రూ. 1380.9 కోట్లు కేటాయించనున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. రెండు నెలలు పూర్తయినా సీఎం హామీలకు ఇసుమంత పురోగతి లేదు.

నేడు జిల్లాకు సీఎం చంద్రబాబు రాక



కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం జిల్లా పర్యటనకు రానున్నట్లు జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మలమడుగు మండలంలో పర్యటిస్తారని పేర్కొన్నారు. ఇందులో భాగంగా గూడెం చెరువు గ్రామంలో లబ్ధిదారు గృహానికి వెళ్లి పింఛన్ల పంపిణీ, ప్రజా వేదిక కార్యక్రమంలో పాల్గొంటారు. అలాగే నానుబాల యల్లప్ప ఫంక్షన్ హాలులో స్థానిక నేతలతో భేటీ , అనంతరం గండికోటలో పలు అభివృద్ధి ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారని కలెక్టర్ పేర్కొన్నారు.

సీఎం షెడ్యూల్

ఉదయం 11.45 గంటలకు కడప విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలిక్యాప్టరులో బయల్దేరి మధ్యాహ్నం 12.15 గంటలకు జమ్మలమడుగులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 12.25కు గూడెంచెరువుకు చేరుకుంటారు. 12.45 వరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో పాల్గొంటారు. 12.50 గంటలకు గూడెంచెరువులోని ప్రజావేదిక వద్దకు చేరుకుంటారు. 2 గంటల వరకు ఆ కార్యక్రమంలో పాల్గొంటారు. 2.35 నుంచి 3.35 వరకు నానుబాల యల్లప్ప ఫంక్షన్ హాల్‌లో స్థానిక కేడర్ నేతలతో సమావేశం అవుతారు. అనంతరం 3.45కు హెలిక్యాప్టరులో బయల్దేరి 3.55 గంటలకు గండికోట హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. 4.05 గంటలకి గండికోటలో ఒబెరాయ్ హోటల్, జార్జ్ వ్యూ పాయింట్, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం సాయంత్రం 4:35 గంటల నుంచి 5:25 గంటల వరకు జేకే రిసార్ట్స్ ఎదురుగా ఏర్పాటు చేసిన స్టేక్ హోల్డర్స్, ప్రాజెక్టు డెవలపర్లతో సమావేశం నిర్వహిస్తారు. అనంతరం 5.50కి కడప విమానాశ్రయం చేరుకుంటారు. 6.00 గంటలకు కడప నుంచి బయలుదేరుతారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి



సభా ప్రాంగాణాన్ని పరిశీలించడానికి వస్తున్న మంత్రి సవిత, నాయకులు

జమ్మలమడుగు రూరల్: సీఎం నారా చంద్రబాబు నాయుడి జమ్మలమడుగు పర్యటనను కలసికట్టుగా విజయవంతం చేయాలని జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్.సవిత అన్నారు. శుక్రవారం జమ్మలమడుగు మండలపరిధిలోని గూడెంచెరువు గ్రామంలో జరిగే ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను ఆమె ముఖ్యమంత్రి పర్యటన సలహాదారు పెందుర్తి వెంకటేశ్ జిల్లా నేతలతో కలిసి పర్యవేక్షించారు. జిల్లా టీడీపీ అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ దేవగుడి నారాయణరెడ్డి, జమ్మలమడుగు ఇంఛార్జీ భూపేష్ రెడ్డి , ఆర్డీఓలు జాన్ ఎర్విన్, చంద్రమోహన్, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘన



పెద్దరోడ్డు వీధిలో ఎగురుతున్న టీడీపీ జెండా

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలకు సంబంధించి మండలంలో అడుగడుగునా ఎన్నికల కోడ్ ఉల్లంఘన కనిపిస్తోంది. గురువారం మండల పరిధి కొండ మాచుపల్లి గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటం, ఆయన ప్రవేశపెట్టిన ఇది మంచి ప్రభుత్వం అనే గోడపత్రాలు కనిపిస్తున్నాయి. ఈ పంచాయతీలో ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి సంఘటనలు బయటపడడం ఇది రెండోసారి, అలాగే కొత్త మాధవరం గ్రామంలోని పెద్దరోడ్డు వీధిలో టీడీపీ జెండా ఎగురుతూ కనిపించింది. సంబంధిత ఎన్నికల అధికారి కోడ్ అమలు చేయడంలో విఫలమయ్యారని ప్రజలు అంటున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాలి

జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

కడప అగ్రికల్చర్: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలని ఏడీఏలకు, ఆత్మ సిబ్బందికి జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ సూచించారు. గురువారం ఊటుకూరు వ్యవసాయ పరిశోధన స్థానంలో వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ వారు ఉమ్మడి జిల్లాలోని అన్ని డివిజన్ల సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) ఆత్మ సిబ్బందికి సహజ, సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ మాట్లాడుతూ సాంకేతిక యాజమాన్య సంస్థ ద్వారా సహజ సేంద్రియ వ్యవసాయ పద్ధతులలో ప్రదర్శన క్షేత్రాలు, శిక్షణ కార్యక్రమాలు, రైతు క్షేత్ర పాఠశాలలు నిర్వహించి ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కృషి విజ్ఞాన కేంద్ర వ్యవసాయ పర్యవేక్షణ శాస్త్రవేత్త శిల్పకళ ప్రకృతి వ్యవసాయంలో వివిధ పద్ధతులలో వరి, కంది, వేరుశనగ, పత్తిలో చీడపీడల యాజమాన్యం గురించి అవగహన కల్పించారు. ఆత్మ ప్రాజెక్టు డైరెక్టర్ విజయలక్ష్మి మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లాలకు చెందిన డివిజన్ల ఏడీఏలు, ఆత్మ సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల కొరత నివారణకు చర్యలు

జిల్లాలో ఎరువుల కొరత నివారణకు చర్యలు తీసుకున్నామని జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ సూచించారు. గురువారం కడప కలెక్టరేట్‌లోని వ్యవసాయ కార్యాలయ సమావేశ మందిరంలో ఎరువుల హోల్‌సేల్ డీలర్లు, కంపెనీ సేల్స్ ఆఫీసర్లకు ఎరువుల సరఫరాపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎరువుల కంపెనీ యాజమాన్యం రాష్ట్ర కమీషనరేట్‌కు ఇచ్చిన ప్రకారం ఎరువులను సరఫరా చేస్తే ఎరువుల కొరత ఉండదన్నారు. కంపెనీ ఇచ్చిన ఇండెంట్ ప్రకారం ఎరువులను సరఫరా చేయాలని కోరారు. అలాగే జిల్లాలోని ఎరువుల హోల్‌సేల్ డీలర్లు కూడా జిల్లాలోని ఎరువుల వ్యాపారులకు మాత్రమే ఎరువులను సరఫరా చేయాలన్నారు. మార్క్‌ఫెడ్ డీఎం పరిమళజ్యోతి, జేడీఏ కార్యాలయ టెక్నికల్ ఏవో గోవర్ధన్, ఎరువుల హోల్‌సేల్ డీలర్లు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లాకు యూరియా రాక

జిల్లాకు గురువారం 1300 మెట్రిక్ టన్నుల యూరియా వచ్చినట్లు జిల్లా వ్యవసాయ అధికారి చంద్రనాయక్ తెలిపారు. ఇందులో 1025 మెట్రిక్ టన్నులు వైఎస్సార్ జిల్లాకు కేటాయించగా 500 మెట్రిక్ టన్నులను మార్క్‌ఫెడ్‌కు, మరో 525 మెట్రిక్ టన్నులను ప్రైవేటు డీలర్లకు కేటాయించినట్లు తెలిపారు. అలాగే మరో 275 మెట్రిక్ టన్నులను అన్నమయ్య జిల్లాకు కేటాయించినట్లు తెలిపారు. ఇందులో 150 మెట్రిక్ టన్నులను మార్క్‌ఫెడ్‌కు కేటాయించగా మరో 125 టన్నులను ప్రైవేటు డీలర్లకు కేటాయించినట్లు తెలిపారు. జిల్లాకు వచ్చిన ఎరువులను జేడీఏ కార్యాలయ టెక్నికల్ ఏవో గోవర్ధన్‌తో కలిసి రైల్వే స్టేషన్‌లో ఆయన యూరియాను పరిశీలించారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థిని ఆశీర్వదించండి

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



జెడ్పీ కార్యాలయానికి ప్రదర్శనగా వస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు

కడప సెవెన్‌రోడ్స్: పులివెందుల జెడ్పీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తుమ్మల హేమంత్‌రెడ్డిని మండల ప్రజలు, కార్యకర్తల ఆశీర్వదించాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. గురువారం వైఎస్సార్ సీపీ అభ్యర్థులుగా తుమ్మల హేమంత్‌రెడ్డి, తుమ్మల ఉమాదేవి ఎన్నికల అధికారి సి.ఓబులమ్మకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ పులివెందుల జెడ్పీటీసీగా ఉన్న తుమ్మల మహేశ్వర్‌రెడ్డి అకాల మరణం బాధాకరమన్నారు. తమ పార్టీ అభ్యర్థిగా మహేశ్వర్ రెడ్డి కుటుంబానికి చెందిన వారికే జెడ్పీటీసీ అభ్యర్థిగా ఎంపిక చేశామన్నారు. పులివెందుల మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు, కార్యకర్తలు ఆ కుటుంబాన్ని ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా నామినేషన్ దాఖలు చేసిన తుమ్మల హేమంత్‌రెడ్డి మాట్లాడుతూ 2021లో జెడ్పీటీసీగా పనిచేసిన తన తండ్రి ప్రమాదవశాత్తు మరణించారన్నారు. తనకు జెడ్పీటీసీగా అవకాశం కల్పించడం పై మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఎంతో బాధ్యత మోపారని, తాను క్రమశిక్షణతో పార్టీ కోసం పనిచేస్తానని చెప్పారు.

ప్రదర్శనగా....

తొలుత వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుంచి ప్రదర్శనగా జెడ్పీ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి, నగర మేయర్ కె.సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కల్లూరు నాగేంద్రారెడ్డి, పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, నాయకులు చిన్నప్ప, ఎం.బలరామిరెడ్డి, కె.విజయ్‌కుమార్‌రెడ్డి, కేవీ ఓబులేశు, ఎ.వెంకట భాస్కర్‌రెడ్డి, నగర పాలక సంస్థ డిప్యూటీ మేయర్ బండి నిత్యానందరెడ్డి, పులి సునీల్‌కుమార్, సంబటూరు ప్రసాద్‌రెడ్డి, దాసరి శివప్రసాద్, జయచంద్రారెడ్డి, సీహెచ్ వినోద్‌కుమార్, నాగేంద్ర, షఫీ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ సీపీ తరఫున ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న హేమంత్‌రెడ్డి

'ఇరగంరెడ్డి'నామినేషన్ దాఖలు


ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి గురువారం నామినేషన్ పత్రాలు ఎన్నికల అధికారి ఓబులమ్మకు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గతంలో తాను ఒంటిమిట్ట జెడ్పీటీసీగా గెలుపొంది జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా పనిచేశానన్నారు. మళ్లీ ఇప్పుడు రెండవసారి జెడ్పీటీసీగా పోటీ చేసేందుకు అవకాశం లభించిందన్నారు.

రెండోరోజు ఎనిమిది నామినేషన్లు
కడప సెవెన్‌రోడ్స్: పులివెందుల, ఒంటిమిట్ట జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ స్థానాలకు గురువారం ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయి. పులివెందుల జెడ్పీటీసీ స్థానానికిగాను వైఎస్సార్ సీపీ తరఫున తుమ్మల హేమంత్‌రెడ్డి రెండు, తుమ్మల ఉమాదేవి రెండు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఓబులమ్మకు అందజేశారు. ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానానికి వైఎస్సార్ సీపీ తరుపున ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, టక్కోలు శివారెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. జనసేన పార్టీ తరుపున కోనేటి హరి వెంకట రమణ, స్వతంత్ర్య అభ్యర్థిగా వై.మధుమూర్తి నామినేషన్ దాఖలు చేశారు. దీంతో రెండవరోజు నాటికి మొత్తంగా 13 నామినేషన్లు దాఖలయ్యాయి.



నామినేషన్ దాఖలు చేస్తున్న ఒంటిమిట్ట జెడ్పీటీసీ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి

భగ్గుమన్న బొప్పాయి రైతు



రోడ్డుపై మంటలు వేసి ఆందోళన చేస్తున్న రైతులు

- ధరలు తగ్గుదలపై మండిపాటు
- రోడ్లపై మంటలులు వేసి ఆందోళన
- అడ్డుకున్న పోలీసులు
- రైతు వెన్నువిరుస్తున్న దళారులు

రైల్వేకోడూరు అర్బన్: జిల్లాలోని రైల్వేకోడూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో బొప్పాయి పంట దిగుబడి మొదలైంది.రెండు నెలల క్రితం టన్ను రూ. 20 వేలు ఉండేది. వ్యాపారులు కుమ్మక్కై రేటును తగ్గిస్తూ వచ్చారు.గురువారానికి రూ. 6 వేలు అవడంతో రైతులు భగ్గుమన్నారు. స్థానిక తిరుపతి రోడ్డు, టోల్‌గేట్, చిట్వేలిరోడ్డు, బైపాస్, రాఘవరాజపురం వ్యాపారుల కార్యాలయాల వద్ద కోడూరు, ఓబులవారిపల్లి, చిట్వేలిలకు చెందిన 500 మంది గురువారం ఉదయం ఆందోళన చేశారు. బొప్పాయి లోడింగ్‌కు పోతున్న లారీలను ఆపేసి అందులోని గడ్డి తీసి రోడ్డుపై కుప్పలు వేసి నిరసన వ్యక్తం చేశారు. పలు చోట్ల పోలీసులు, రైతుల మధ్య వాగ్వాదం జరిగింది. వ్యాపారులను, దళారీలను నిలదీశారు. నిరసనలతో 15 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించి పోయింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతులు ఎక్కువగా బొప్పాయి పంటను పండిస్తుంటారు. ఖర్చులు, భూమి కౌలు కలిపి ఎకరాకు లక్ష రూపాయల వరకు ఖర్చు వస్తుంది. తెగుళ్లను జయించి పంట దిగుబడి చేస్తే కోతకు ముందు ధరలు పెంచి ఆశలు పెడతారు. తీరా ఎగుమతుల సమయంలో ప్రతి ఏడాది ధరలు భారీగా తగ్గించి నట్టేట ముంచుతున్నారని వాపోయారు. ఇప్పుడున్న టన్ను 7 వేల రూపాయల ధర ఏ మాత్రం సరిపోదని, ఆత్మహత్యలు చేసుకోవాల్సిందేనని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పోలీసుల హెచ్చరిక

ఆందోళన చేస్తున్న రైతులను సీఐ హేమసుందర్ రావు, పోలీసులు అడ్డుకున్నారు. తాహసీల్దార్ కార్యాలయం వద్దకు రావాలని, చర్చలు జరుపుతామని తెలిపారు. దీంతో రైతులు సభాభవనం వద్దకు చేరుకొన్నారు. కొద్దిసేపటికి జిల్లా ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ హెగ్డే అక్కడికి చేరుకొని రైతులను హెచ్చరించారు. ధర్నాలు రాస్తారోకోలు చేస్తే కేసులు నమోదు చేయాల్సి వస్తుందని తెలిపారు. అలాగే టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కారూపానందరెడ్డి , తాహసీల్దార్ అమర్‌నాథ్ ధరల గురించి తెలుసుకొని జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి దళారీలపై చర్యలు తీసుకొంటామని తెలిపారు. బొప్పాయి రైతులకు న్యాయం జరుగుతుందో లేదో వేచి చూడాలి.

క్లుప్తంగా

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మృతదేహాలు





కడప అర్బన్ : కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్)లో చికిత్స కోసం వచ్చి వేర్వేరు సమయాల్లో ఇద్దరు మృతి చెందారు. మృతదేహాలకు సంబంధించిన ఆచూకీ తెలిసిన వారి బంధువులు తగిన ఆధారాలతో సంప్రదించాలని రిమ్స్ అధికారులు తెలిపారు.

మైదుకూరులో మళ్లీ ఎన్‌హెచ్‌ఆర్‌డీఎఫ్ సేవలు

మైదుకూరు : మైదుకూరులో మళ్లీ జాతీయ ఉద్యానవన పరిశోధన, అభివృద్ధి కేంద్రం (ఎన్‌హెచ్‌ఆర్‌డీఎఫ్) సేవలు రైతులకు అందనున్నాయని బీజేపీ జాతీయ మాజీ కార్యవర్గ సభ్యుడు, రైతు నాయకుడు బీపీ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఆర్‌డీఎఫ్‌కు జలవనరుల శాఖ స్థలం కేటాయించే విషయంలో జిల్లా కలెక్టర్, తెలుగుగంగ ఎస్ఈ నుంచి బుధవారం ఉద్యానశాఖ డైరెక్టర్ జలవనరుల శాఖ కార్యదర్శికి ప్రతిపాదనలు పంపినట్లు పేర్కొన్నారు. ఇక రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయింపుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం అనుమతి ఇస్తే ఈ ఖరీఫ్ ఆఖరుకైనా ఎన్‌హెచ్‌ఆర్‌డీఎఫ్(ఉల్లి పరిశోధన కేంద్రం) ఏర్పాటు అవుతుందన్నారు. కాగా మైదుకూరులో ఉన్న ఎన్‌హెచ్‌ఆర్‌డీఎఫ్ కేంద్రాన్ని 2007లో మూసివేసి కర్నూలుకు తరలించారు.

పేకాట ఆడినవారిపై పోలీసులకు ఫిర్యాదు

కడప కార్పొరేషన్ : తన బంగళాలో పేకాట ఆడిన నలుగురు ఉద్యోగులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కడప నగరపాలక సంస్థ కమిషనర్ మనోజ్‌రెడ్డి కోరారు. గురువారం ఆయన వన్‌టౌన్ సీఐకి ఫిర్యాదు చేశారు. పేకాట ఆడిన సి. అరుణ్‌రాజ్, వి. ప్రేమ్ కార్తీక్, ప్రతాప్, రాజ్‌కుమార్‌లపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే క్లాప్ యూజర్ చార్జీల అక్రమ వసూళ్లపై జరుగుతున్న సమగ్ర విచారణ పూర్తి అయిన వెంటనే. దోషులుగా తేలిన వారిపై శాఖాపరమైన, క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఖైదీలకు సౌకర్యాలు కల్పించాలి

కడప అర్బన్ : ఖైదీలకు సరైన సౌకర్యాలను కల్పించాలని, లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల గురించి ఖైదీలలో అవగాహన పెరగాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్ అన్నారు. తమ సిబ్బందితో కలిసి గురువారం కడపలోని పురుషుల కేంద్ర కారాగారం , ప్రత్యేక మహిళా కేంద్ర కారాగారాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా జడ్జి కారాగారం పరిసరాలను, వసతి గదులను, వంటగదిని, టాయిలెట్స్‌ను, రిజిస్టర్లను పరిశీలించారు. ఖైదీలకు అందుతున్న సదుపాయాలను తెలుసుకున్నారు. కేంద్ర, మహిళా కారాగారం సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

చీనీ కాయలు తరలించారు..
డబ్బులు ఎగ్గొట్టారు!

- అమరావతి శంకుస్థాపనకు పులివెందుల నుంచి తరలిన 150 టన్నుల చీనీ కాయలు
- డబ్బులు చెల్లించని అధికారులు
- మూడు నెలలుగా ఎదురు చూస్తున్న రైతులు, మండీ యజమానులు



విక్రయానికి సిద్ధంగా ఉన్న చీనీ కాయలు

పులివెందుల రూరల్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతిలో నూతన రాజధాని నిర్మాణ పనులకు ఈ ఏడాది జూన్ 2వ తేదీన భారత ప్రధాని నరేంద్ర మోడీ చేతుల మీదుగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేయించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు పులివెందుల నియోజకవర్గంలోని చీనీ కాయల రైతుల వద్ద నుంచి సుమారు రూ.25 లక్షలు విలువచేసే 150 టన్నుల చీనీ కాయలను విజయవాడకు 11 లారీలలో తరలించారు. మూడు నెలలవుతున్నప్పటికీ అధికారులు చీనీ కాయల మండి యజమానులు, రైతులకు డబ్బులు చెల్లించలేదు. ప్రభుత్వం నుంచి వచ్చిన చీనీ కాయల డబ్బులను అధికారులు మండి యజమానులకు చెల్లిస్తే వారు రైతులకు చెల్లించాల్సి ఉంది. మూడు నెలల నుంచి చీనీ కాయల డబ్బులు ఇవ్వాలని అడుగుతున్నా అటు ప్రభుత్వ అధికారులు కానీ, ఇటు ప్రజాప్రతినిధులు గానీ పట్టించుకోవడంలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులను చీనీ కాయల డబ్బులు చెల్లించాలని అడిగితే ఒకరి మీద ఒకరు చెప్పుకుంటున్నారని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి విజయవాడకు తరలించిన చీనీ కాయలకు సంబంధించిన డబ్బులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని మండి యజమానులు, రైతులు కోరుతున్నారు.

చీనీ కాయల డబ్బులను వెంటనే చెల్లించాలి



ప్రధాని నరేంద్ర మోడీ అమరావతి శంకుస్థాపనకు వస్తున్నారని కూటమి నాయకులు, సంబంధిత అధికారులు పులివెందుల ప్రాంతంలోని పలు మండలాల నుంచి సుమారు 150 టన్నుల చీనీ కాయలను తరలించారు. మూడు నెలలవుతున్నా ఒక్క పైసా కూడా ఇవ్వ లేదు. దీంతో రైతులు, మండి యజమానులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చీనీ కాయలకు సంబంధించిన డబ్బులను వెంటనే ఇవ్వాలి.

– సూరారెడ్డి, చీనీ కాయల మండీ అసోసియేషన్ అధ్యక్షుడు, పులివెందుల.

ఇస్తామంటున్నారు.. ఇవ్వడంలేదు..



పులివెందుల చీనీ కాయల మార్కెట్ నుంచి అమరావతి శంకుస్థాపనకు రూ.25 లక్షలు విలువ చేసే సుమారు 150 టన్నుల చీనీ కాయలను మూడు నెలల క్రితం 11 లారీలలో తరలించాము. దీనికి సంబంధించిన డబ్బులను అడిగితే సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారు. ఇస్తాంలే.. పైనుంచి డబ్బులు రాలేదంటున్నారు.

– రమణారెడ్డి, చీనీకాయల మండీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్.

యోగా పోటీల్లో వైఎస్సార్ కడపకు ఓవరాల్ చాంపియన్ షిప్ టైటిల్



ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని అందజేస్తున్న పల్నాడు డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రవి

యడ్లపాడు : చిలకలూరిపేట మండలం మద్దిరాలలోని పీఎంశ్రీ జవహర్ నవోదయ పాఠశాలలో జవహర్ నవోదయ విద్యాలయాల పరిధిలో నిర్వహిస్తున్న ప్రాంతీయస్థాయి యోగాక్రీడా ప్రదర్శన పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్ షిప్ టైటిల్‌ను వైఎస్సార్ కడప క్లస్టర్‌లోని జేఎన్‌వీ సాధించుకుంది. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాలలోని 8 క్లస్టర్ల నుంచి క్లస్టర్ లెవర్ వరకు జరిగిన యోగా పోటీల్లో గెలుపొందిన జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. కృష్ణా, వైఎస్సార్ కడప, బీదర్, షిమోగా, తుమ్మకూర్, పట్నంతిట్టా, వైనాడ్, ఖమ్మం ప్రాంతాలకు చెందిన 278 మంది క్రీడాకారులు పాల్గొని ఆసనాలు, ఆర్టిస్టిక్, రిథమిక్ విభాగాల్లో యోగా విన్యాసాలు ప్రదర్శించి తమ కళాత్మక నైపుణ్యాలను చాటారు. ఆయా పోటీల్లో రాష్ట్రానికి చెందిన వైఎస్సార్ కడప క్లస్టర్ జేఎన్‌వీ ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను కైవసం చేసుకోగా, కృష్ణా క్లస్టర్ ద్వితీయస్థానంలో నిలిచింది. అన్ని విభాగాల్లో ప్రథమస్థానంలో నిలిచి ఛాంపియన్‌షిప్‌గా నిలిచిన వైఎస్సార్ కడప క్లస్టర్ విద్యార్థులను, ద్వితీయస్థానంలో నిలిచిన కృష్ణా క్లస్టర్ విద్యార్థులను పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బి.రవి షీల్డ్‌లు, సర్టిఫికెట్లతో సత్కరించారు.

సోలార్ కంపెనీపై చర్యలు తీసుకోవాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

జమ్మలమడుగు : పెద్దముడియం మండలం కల్వటాల గ్రామంలో రైతుల వద్ద నుంచి బలవంతంగా భూములు వసూలు చేస్తున్న సేల్ సోలార్ కంపెనీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకోవాలని రైతు సంఘం, సీఐటీయూ, డీవైఎఫ్ఐ, చేనేత కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎన్జీఓ కార్యాలయంలో సోలార్ కంపెనీ చేస్తున్న దౌర్జన్యాలు, అక్రమాలను వివరిస్తూ కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోలార్ కంపెనీ యాజమాన్యం నిరుపేదలైన నిరక్షరాస్య రైతులను మాత్రమే టార్గెట్ చేసి వారికి మాయమాటలు చెప్పి కొంత సొమ్మును ఇచ్చి ఖాళీ కాగితాలపై సంతకం పెట్టించుకుంటోందన్నారు. పట్టా భూముల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. సోలార్ కంపనీ దౌర్జన్యాలను అధికారులు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం నాయకుడు దస్తగిరిరెడ్డి, ఏసుదాసు, దాసరి విజయ్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్, చేనేత సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు..

డ్రాగా ముగిసిన అండర్–16 మల్టీ డే మ్యాచ్‌లు



లోకేష్, కడప (85 పరుగులు)



వీజే నియోల్, చిత్తూరు (60 పరుగులు)



నిహాల్ మాలిక్, చిత్తూరు (4 వికెట్లు)



కేవీ ఓంకార్, కర్నూలు (57 పరుగులు)

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్–16 మల్టీ డే మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. మూడో రోజు గురువారం వైఎస్ఆర్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో కడప–అనంతపురం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రాగా ముగిసింది. 242 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మ్యాచ్‌ను ప్రారంభించిన అనంతపురం జట్టు 84.4 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 325 పరుగులకు డిక్లేర్ చేసింది. ఆ జట్టులోని ఆదినారాయణరెడ్డి బ్యాటింగ్‌లో చక్కగా రాణించి 156 పరుగులు చేశాడు. దేవాన్ష్ 47 పరుగులు చేశాడు. కడప జట్టులోని హితేష్ సాయి 3 వికెట్లు, గైబు 3 వికెట్లు తీశారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 67.2 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 269 పరుగులు చేసింది. ఆ జట్టులోని లోకేష్ 85 పరుగులు, ఫైజాన్ 45 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని కిరణ్‌కుమార్ 3 వికెట్లు తీశాడు. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్ అనంతపురం జట్టు ఆధిక్యం సాధించింది.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో..

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు–కర్నూలు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్ డ్రాగా ముగిసింది. గురువారం మూడో రోజు 300 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మ్యాచ్‌ను ప్రారంభించిన కర్నూలు జట్టు 111.5 ఓవర్లలో 322 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని వివేక్ 35 పరుగులు చేశాడు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 71.1 ఓవర్లలో 215 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని విజె నోయెల్ 60 పరుగులు, హర్ష 36 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని వివేక్ 3 వికెట్లు, సాయి విష్ణేష్ 3 వికెట్లు తీశారు. తర్వాత రెండవ ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 12 ఓవర్లకు 3 వికెట్లు కోల్పోయి 103 పరుగులు చేసింది. దీంతో చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో ఆధిక్యం సాధించింది.



కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో చిత్తూరు-కర్నూలు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

అక్రమ చేపల వేట నిర్వహణపై కఠిన చర్యలు

రాష్ట్ర మత్స్యశాఖ అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి



చేప పిల్లలను నీటిలో వదులుతున్న రాష్ట్ర మత్స్యశాఖ అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

కడప అగ్రికల్చర్ : నిషేధిత సమయంలో జలాశయాలలో అక్రమ చేపల వేట నిర్వహించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని మృత్స్యశాఖ సిబ్బందిని రాష్ట్ర మత్స్యశాఖ అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం కడపలోని మత్స్యశాఖ కార్యాలయంలో కడప, అన్నమయ్య జిల్లాలకు చెందిన మత్స్యశాఖ అధికారులు, సిబ్బందితో శాఖాపరమైన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత లైసెన్సులు జారీ చేసే జలాశయాలైన సోమశిల వెనుక జలాలు, బ్రహ్మసాగర్, గండికోట జలాశయాలలో చేపల వేట నిషేధాన్ని టాస్క్‌ఫోర్స్ కమిటీతో పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. మత్స్యశాఖ సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ కమిటీలు ఏర్పాటు చేసి అక్రమ చేపల వేటను అరికట్టాలన్నారు. అలాగే ప్రధానమంత్రి మత్స్య సంపద సంయోజన పథకంలో వివిధ యూనిట్ల అమలు గురించి ఆరా తీశారు. దీంతోపాటు ఎస్ఎఫ్‌డీపీ, ఈశ్రమ మత్స్యకారులకు సంబంధించి వివరాలు రిజిస్ట్రేషన్ చేసే విషయం, అలాగే కేసీసీ లోన్స్ మంజూరుపై తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం రాష్ట్ర మత్స్యశాఖ అడిషనల్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి కార్యాలయ ఆవరణంలో చేప పిల్లల పెంపకానికి సంబంధించిన నీటిలో చేప పిల్లలను వదిలారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి నాగయ్య, అన్నమయ్య జిల్లా ఎఫ్‌డీఓలు మోహన్‌క్రిష్ణ, సుబ్బనరసయ్య, నరేంద్రబాబు, మురళీ, కడప జిల్లా ఎఫ్‌డీఏలు కిరణ్‌కుమార్, బాలరాజు రెండు జిల్లాల గ్రామ మత్స్య సహాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సేవా దృక్పథం అవసరం



అంకిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, బంధువులు

జమ్మలమడుగు : సేవా దృక్పథం కలిగిన ఉపాధ్యాయులు సమాజానికి ఎంతో అవసరమని జమ్మలమడుగు మండల విద్యాధికారి రామయ్య పేర్కొన్నారు. గురువారం కొండాపురం మండలం తాళ్లప్రొద్దుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్.జయ అంకిరెడ్డి ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు సాంబశివారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఈఓ మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులకు తమ వంతు బాధ్యతగా సాయం చేసే గుణం ఉపాధ్యాయులు కలిగి ఉండాలన్నారు. అందుకు నిదర్శనం జయ అంకిరెడ్డి అని కొనియాడారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను అందించినప్పుడే సమాజం బాగుపడుతుందన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ చేస్తుంటే ఆ బాధ్యతను మిగిలిన ఉపాధ్యాయులు తీసుకోవాలన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు తమ అనుభవాలను విద్యార్థులకు వివరించడం ద్వారా వారిని సన్మార్గంలో నడిపేందుకు కృషి చేయాలని సూచించారు. దత్తాపురం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఏపీటీఎఫ్ నాయకుడు శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ అంకిరెడ్డి ఉపాధ్యాయుడిగా ఎందరికో ఆదర్శంగా నిలిచారన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం పోరాటం చేయడమే కాకుండా పాఠశాలల్లో సమస్యలు ఉంటే సొంత నిధులు వెచ్చించి ఆ సమస్యలను పరిష్కరించేవారన్నారు. 36 సంవత్సరాల ఉపాధ్యాయ జీవితంలో ఎందరినో ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. అనంతరం అంకిరెడ్డిని ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు ఎంపీడీఓ విజయరాఘవరెడ్డి, స్కూల్ కమిటీ చైర్మన్ శ్రీరాములరెడ్డి, రెండెద్దుల రామాంజనేయులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని యువకుడి మృతి



మణికంఠ మృతదేహం

కడప అర్బన్ : కడప నగరం రైల్వే స్టేషన్ రోడ్డు సమీపంలో బుధవారం రాత్రి వేగంగా వచ్చి ఆటో ఢీకొనడంతో మణికంఠ(19) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. కడప వన్ టౌన్ ఎస్ఐ అమరనాథ్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు కమలాపురం మండలానికి చెందిన మణికంఠ బేల్దారి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. యువకుని తల్లిదండ్రులు శైలజ, గంగాధర్‌లు కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం ఊరి నుంచి సొంత పని నిమిత్తం కడపకు చేరుకున్నాడు. కడప రైల్వేస్టేషన్ సమీపంలో రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తు తెలియని ఆటో వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మణికంఠ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నామని ఎస్ఐ వెల్లడించారు.

గండికోటకు కృష్ణా జలాలు



అవుకు రిజర్వాయర్ వద్ద కృష్ణా జలాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి

కొండాపురం : అవుకు రిజర్వాయర్ నుంచి గాలేరు నగరి సుజల స్రవంతి ప్రధాన కాలువ ద్వారా 2500 క్యూసెక్కుల నీటిని జమ్మలమడుగు ఎమ్మెల్యే సి.ఆదినారాయణరెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి అవసరాల కోసం గండికోట ప్రాజెక్టుకు అవుకు రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేశామన్నారు. జీఎస్ఎస్ఎస్ ఈఈ ఉమా మహేశ్వర్ మాట్లాడుతూ గండికోట పూర్తి సామర్థ్యం 26.85 టీఎంసీలు కాగా ప్రస్తుతం 11.04 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. మైలవరం జలాశయంలో 4.50 టీఎంసీల నీరు నిల్వ ఉంచేందుకు 15 వేల క్యూసెక్కుల నీటిని మైలవరం జలాశయానికి తరలిస్తున్నామని తెలిపారు. అలాగే గండికోట ఎత్తిపోతల పథకం ద్వారా 330 క్యూసెక్కుల నీటిని 3 మోటార్ల సాయంతో తరలిస్తున్నామని చెప్పారు. జీఎస్ఎస్ఎస్ ప్రధాన కాలువ నుంచి శెట్టివారిపల్లె మెయిన్ హెడ్ రెగ్యులేటర్ ద్వారా 150 క్యూసెక్కుల నీటిని సర్వరాయ సాగర్‌కు తరలిస్తున్నామని పేర్కొన్నారు.

యూనిఫాం వెనక్కు ఇవ్వలేదని.. విద్యార్థినిపై చేయిచేసుకున్న టీచర్



విద్యార్థిని చెంపపై తేలిన వాతలు

ప్రొద్దుటూరు కల్చరల్ : యూనిఫాం వెనక్కి ఇవ్వలేదని విద్యార్థినిపై టీచర్ చేయిచేసుకున్న సంఘటన ప్రొద్దుటూరు నడింపల్లె మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం జరిగింది. దస్తగిరిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ముల్లా జుబేరియా ఐదో తరగతి చదువుతోంది. ఈ పాఠశాలలో యూనిఫాం ఇచ్చిన తర్వాత ఆ విద్యార్థిని నడింపల్లె మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో చేరింది. తమ పాఠశాలలో తీసుకున్న యూనిఫాం తిరిగి ఇవ్వాలని దస్తగిరిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు షేక్ సబీహా మరొక విద్యార్థితో చెప్పి పంపింది. యూనిఫాం ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన ఉపాధ్యాయురాలు గురువారం విద్యార్థిని చదువుతున్న పాఠశాలకు వెళ్లి తరగతి గదిలో విద్యార్థిని చెంపపై కొట్టి వెళ్లిపోయింది. తరగతి గదిలోని ఉపాధ్యాయురాలు సంపూర్ణ పరిశీలించగా విద్యార్థిని చెంపపై వాతలు కనిపించాయి. దీంతో ప్రధానోపాధ్యాయుడు శంకర్ దృష్టికి విషయం తీసుకెళ్లారు. దీంతో ఆయన ఎంఈఓ శోభారాణికి ఫిర్యాదు చేశారు.

ఆస్తులకు ఆటో మ్యుటేషన్

- నేటి నుంచి విధానం అమలు
- పన్ను బకాయిలు ఉంటే స్లాట్ బుక్ అవదు
- మార్కెట్ విలువ, విస్తీర్ణం ఆధారంగా మ్యుటేషన్ చార్జీలు
- నగర వాసులకు ఎంతో ప్రయోజనం



కడపలోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

కడపకోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆదాయ మార్గాలకు కొత్తదారిని ఎంచుకుంటోంది. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి వాటి అమలుకు నిధుల వేట కొనసాగిస్తోంది. రిజిస్ట్రేషన్ శాఖలో ఆగస్టు 1వ తేదీ నుంచి ఆస్తులకు ఆటోమ్యుటేషన్ పేరిట కొత్త విధానాన్ని అమలులోకి తీసుకొస్తున్నారు. ఎవరైనా ఇంటి, నీటి పన్ను బకాయిలు ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లు జరగవు. గతంలో అయితే ఈ పన్నుల బకాయిలు ఉన్నా రిజిస్ట్రేషన్లు చేసేవారు. ఆ తర్వాత వినియోగదారుడు మున్సిపల్ కార్యాలయంలో మ్యుటేషన్ చేసుకునేవారు. అయితే ఈ ప్రక్రియలో పన్ను బకాయిలు ఉన్నా రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధం లేదు. రిజిస్ట్రేషన్లు చేసేవారు. అయితే ఇప్పుడు మ్యుటేషన్ ప్రక్రియను పూర్తి చేసేవారు సచివాలయాల నుంచిగానీ, నగర పాలక సంస్థ కార్యాలయానికి దరఖాస్తు చేసుకుంటే పరిశీలన అయ్యాక టైటిల్ మార్పు చేసి పన్ను విధించేవారు. ఈ విధానంలో మార్పును తీసుకు వస్తూ ఆటో మ్యుటేషన్ పేరిట కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు.

ముఖ్యంగా వ్యవసాయ పొలాలకు మాత్రమే ఆటో మ్యుటేషన్ విధానం అమలులో ఉండేది. వాటిని నగరాల్లోని ఇల్లు, వాణిజ్య సముదాయాలకు ఆగస్టు 1వ తేదీ నుంచి అమలు చేయనున్నారు. ఈ విధానాన్ని మొదట ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడలో అమలు చేశారు. అక్కడ ఈ విధానం విజయవంతం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా కడపతోపాటు 17 కార్పొరేషన్ల పరిధిలో దీనిని శుక్రవారం నుంచి అమలు చేయనున్నారు. నగరంలో ఏదైనా స్థలం లేదా ఇంటిని తీసుకుంటే కొనుగోలుదారులు ఆస్తిని తమ పేరిట మార్చుకునేందుకు నగర పాలక సంస్థ కార్యాలయంలో వీటి కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పుడు అలా కాకుండా ఆస్తి ఉన్న రిజిస్ట్రేషన్ ప్రక్రియలో భాగంగా ఆటో మ్యుటేషన్ చేయనున్నారు.

బకాయిలు ఉంటే స్లాట్ బుక్ కాదు

గతంలో ఇల్లు, స్థలాలు, వాణిజ్య సముదాయాల రిజిస్ట్రేషన్‌కు, మ్యుటేషన్‌కు సంబంధం ఉండేది కాదు. పన్ను బకాయిల విషయం పట్టించుకునేవారు కాదు. రిజిస్ట్రేషన్ అయ్యాక కొనుగోలుదారులు ఆ పత్రాల వివరాలతో నగర పాలక సంస్థ కార్యాలయంలో ఓనర్‌షిప్ మార్చుకునేందుకు దరఖాస్తు చేసుకునేవారు. అయితే ఇప్పుడు అలా కాకుండా రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ సమయంలోనే పన్నులు పెండింగ్ లేకుండా అప్‌డేట్ అయి ఉండాలి. సంబంధిత వివరాలను అప్‌లోడ్ చేశాకే స్లాట్ బుక్ అవుతుంది. గతంలో రిజిస్ట్రేషన్ సమయంలో ఇంటికి చెల్లిస్తున్న రశీదు ఖాళీ స్థలమైతే పన్ను రశీదు అందజేసేవారు. ఒకవేళ ఒకే ఆస్తిని ఇద్దరు లేక ముగ్గురు కలిసి కొనుగోలు చేసినా ఇదే విధానం వర్తిస్తుంది. మున్సిపాలిటీ వారు ఇచ్చిన అసెస్‌మెంట్ నెంబర్లను తప్పక నమోదు చేయాలి. మార్కెట్ విలువ, విస్తీర్ణం ఆధారంగా మ్యుటేషన్ ఛార్జీలను చెల్లించాలి. ప్రస్తుతం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కాగానే ఆ వివరాలను కార్పొరేషన్ అధికారులకు ఆన్‌లైన్ ద్వారా తెలియజేస్తారు. అక్కడ వారు పరిశీలించి ఓకే చెప్పగానే ఆటో మ్యుటేషన్ సర్టిఫికెట్ జనరేట్ అవుతుంది. ప్రక్రియ ముగిశాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద కొత్త డాక్యుమెంట్లతోపాటు ఆస్తి బదలాయింపు పత్రం కూడా పొందేలా ప్రక్రియను చేపడతారు. మార్కెట్ విలువ, విస్తీర్ణం ఆధారంగానే మ్యుటేషన్ ఛార్జీలు చెల్లించాలి.

వినియోగదారులకు ఎంతో ఉపయోగకరం



ఆటో మ్యుటేషన్ విధానాన్ని శుక్రవారం నుంచి ప్రవేశ పెడుతున్నాం. రిజిస్ట్రేషన్ స్లాట్ బుకింగ్ సమయంలోనే నగర పరిధిలోని ఆస్తుల అసెస్‌మెంట్ నెంబరును ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. అపుడు ఎలాంటి బకాయిలు ఉండరాదు. ఈ విధానంతో వేగంగా మ్యుటేషన్ జరుగుతుంది. ఇది వినియోగదారులకు ఎంతో ఉపయోగకరం.

– పీవీఎస్ బాబు, జిల్లా రిజిస్ట్రార్, కడప